క్లుప్తంగా

శ్రావణమాస ప్రత్యేక పూజలు



మాచర్ల: శ్రావణ మాసంలో మూడవ శుక్రవారంలో మహిళలు ఆయా అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన పూజా కార్యక్రమాలు జరిపారు. పట్టణంలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి, పోలేరమ్మ, చౌడేశ్వరి, కనకదుర్గ, ఆదిలక్ష్మి, అష్టలక్ష్మి, శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి, గాయత్రిదేవి, 9వ వార్డులోని కనకదుర్గమ్మ అమ్మవార్లుకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ నేతలు ర్యాలీ



దాచేపల్లి : బీజేపీ నాయకులు నా భూమి–నాదేశం కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. నియోజకవర్గ కన్వీనర్ అంబటి నవకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి దాచేపల్లిలో ర్యాలీ చేశారు. దేశ ప్రగతి కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పనిచేస్తున్నారని, భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు దేశం కోసం పనిచేయాలని నవకుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యరమోతు ప్రభాకర్‌రావు, పాట్టిమూర్తి విజయసారధి, అనంత నరసింహారావు, ఉల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బిందెల నీటితో మిర్చి నాటు



పిడుగురాళ్ల: వర్షాలు అంతంత మాత్రంగా కురవడం, నాగార్జునసాగర్ నుంచి నీరు కాలువలకు రాకపోవడంతో ఉన్న కాలువల్లో నీటితో రైతులు బిందెలతో తీసుకుని వస్తూ మిర్చి నాట్లు వేశారు. అంతేకాకుండా వేసిన పంట ఎండిపోకుండా ఉండేందుకు రైతులు మోటర్లు, కాలువల నుంచి నీటిని మొక్కలకు ఎలా అందించాలో అలా అన్ని ప్రయత్నాలు చేస్తూ మొక్కకు జీవంపోస్తున్నారు. సెప్టెంబర్ నెలల్లో వర్షాలు పడితే రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన వర్షంగా మిగిలుతుందని, లేకపోతే వేసి పంట పూర్తిస్థాయిలో నాశనమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని పింఛన్ కార్యక్రమం ఉదయం 5 గంటల నుంచి వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల గడప తట్టి వారి చేతుల్లో అందజేశారు. పట్టణంలోని మొత్తం 6200 పింఛన్లు ఉండగా నూతనంగా 180 పింఛన్లు మంజూరు అయ్యాయని కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు తెలియజేశారు. వాటితో కలిపి మొత్తం 6380 పింఛన్లు అయ్యాయని ఆయన తెలియజేశారు. వలంటీర్లు అందరు పింఛన్ లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారని ఆయన తెలియజేశారు. పట్టణంలోని 17 సచివాలయ పరిధిలో 33 వార్డులోని కౌన్సిలర్లు, ఆయా గృహ సారధులు, వలంటీర్లు సంయుక్తంగా పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో కనక దుర్గ అమ్మవారు



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లో వేంచేసియున్న శ్రీ కనక దుర్గ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదలను స్వీకరించారు. ఆలయ పూజారులు ప్రత్యేక అలంకరణ నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

- మాచర్ల నియోజక వర్గాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేసిన వైఎస్సార్
- వెనుకబడిన పల్నాడు అభివృద్ధికి వైఎస్సార్ విశేష కృషి
- నేడు గ్రామగ్రామాన వైఎస్సార్ వర్ధంతి




కొప్పునూరు అనుపు లిఫ్టు ఇరిగేషన్

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిత్యం ఫ్యాక్షన్ తో అల్లాడి అభివృద్ధికి దూరంగా ఉన్న ఉమ్మడి జిల్లాలో మాచర్ల నియోజక వర్గాన్ని ఏ నాయకుడూ పట్టించుకోలేదు. 2004లో అధికారంలోకి రాగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. తనదైన శైలిలో నిధులు కేటాయించారు. ప్రజలెవ్వరూ ఇబ్బంది పడకూడదని వందల కోట్లు కేటాయించి, నియోజక వర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా 2005లో ఆయన మాచర్ల నియోజక వర్గంలో పర్యటించి సాగు, తాగునీటికి లేక ఇబ్బంది పడుతూ అభివృద్ధికి నోచుకోని మాచర్ల నియోజక వర్గం ఏదో విధంగా అభివృద్ధి చేయాలని తన హయాంలో కొప్పునూరు, అనుపు లిఫ్ట్ ఇరిగేషన్‌కు చింతలతండలో శంకుస్థాపన చేసి రూ. 100కోట్లు కేటాయించి 10వేల ఎకరాలకు సాగు, తాగునీరిచ్చేలా చర్యలు తీసుకున్నారు. వైద్యానికి ప్రాధాన్యత నిస్తూ ప్రతి మండలంలో పీహెచ్‌సి సెంటర్‌ను నియమించారు. కొప్పునూరు, కంభంపాడు, ఆయా మండలాలలోని ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించి కోట్ల రూపాయలు కేటాయించారు. సత్రశాల టైల్‌పాండ్ డ్యాంను రూ. 1000 కోట్లతో నిర్మాణంతో పాటు, జెన్‌కో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో రైతుల ప్రయోజనం కోసం వేల కోట్లు కేటాయించి రైతులకు ఎంతో మేలు చేశారు. నియోజక వర్గ కేంద్రమైన మాచర్ల పట్టణాన్ని 2005లో పర్యటించి రూ. 10కోట్లను మాచర్లకు కేటాయించారు. ఇందిరమ్మ గృహాలను మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా పట్టణాభివృద్ధికి లక్షల రూపాయలు వైఎస్సార్ కేటాయించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆదునీకరణ పనులకు కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టి రైతుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. అదే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ, 108, 104 సేవలను అందుబాటులోకి తెచ్చి పల్లెకు వైద్యం తెచ్చారు. నాగార్జున సాగర్ కుడికాలువ ఆధునీకరణ పనులను వందల కోట్లతో చేపట్టి రైతులకు మేలు చేశారు. గిరిజనులకు అటవీ భూముల హక్కు చట్టాన్ని కల్పించి పట్టాలు మంజూరు చేశారు. దీని వల్ల వందలాది మంది గిరిజన కుటుంబాలకు మేలు జరిగింది. ఎటుచూసినా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించేదుకు ప్రజలు, అభిమానులు భారీ స్థాయిలో ఆయనకు నివాళులర్పించేందుకు సిద్ధమై ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.



వరికపూడిసెల నిర్మాణ ప్రాంతం



సత్రశాల టైల్ పాండ్ డ్యాం

ప్రభుత్వ విప్ పీఆర్కే



ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

నేను మొట్టమొదటిసారి 2009లో వైఎస్సార్ ఆశీస్సులతో ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాను. ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివి. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వైఎస్సార్ వర్ధంతిని బాధతో చేస్తున్న ఆయన చిరస్మరణీయుడుగా నిలిచిపోతారు. వైఎస్సార్ కుటుంబానికి నేను శాశ్వతంగా ఋణపడి ఉంటాను. వారి ఆశయాలకు అనుగుణంగానే పనిచేస్తూ వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాను.

నేడు వైఎస్ వర్ధంతి

మాచవరం: మాచవరం మండపాల సెంటర్‌లో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి హాజరవుతారని, వైఎస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డాక్టర్ మేఘమాల సేవలు అభినందనీయం

మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్



డాక్టర్ మేఘమాలను సన్మానిస్తున్న వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: డాక్టర్ మేఘమాల సేవలు అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డులోని 7వ సచివాలయ పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మేఘమాలను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు దుశాలువాలతో సన్మానించి అభినందించారు. ఆగస్టు 15 సందర్భంగా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ వైద్యాధికారిణిగా ప్రశంసా ప్రతాన్ని అందుకున్నారు దానికి గాను వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు శుక్రవారం అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలో వైద్య సేవలు చేయడంలో మేఘమాల పేరు తెచ్చుకున్నారని, అదేవిధంగా వైద్యశాల నిర్మాణం కోసం స్థలం ఏర్పాటులో కూడా తన పాత్ర ఉందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కాంట్రగుంట శ్రీనివాసరావు, కొక్కెర శ్రీనివాసరావు, నేలటూరి బాలస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరి ప్రసాద్, సుబ్బయ్య, కన్నయ్య, 7వ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి

మాచర్ల: నియోజక వర్గంలోని పట్టణం, ఐదు మండలాల్లో శనివారం జరగనున్న వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు కోరారు. పట్టణంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి బస్టాండ్ సెంటర్ ఎదురు పీఆర్కే, పీవీఆర్‌లు, పార్టీ ప్రజా ప్రతినిధులు, భారీ స్థాయిలో పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అదే విధంగా రింగురోడ్డు సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల నివాళులర్పించిన అనంతరం పేదలకు అల్పాహారం పంపిణీ చేస్తారు.

మాచర్ల మండలంలోని ముత్యాలంపాడు, ఆత్మకూరు జంక్షన్, కంచరగుంటలో వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఆ ప్రాంతంలో వివిధ సేవా కార్యక్రమాలు జరపనున్నారు. విజయపురిసౌత్, దుర్గి, కారంపూడి, వెల్దుర్తి, రెంటచింతలలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

పల్నాడు జిల్లా ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ

మాచర్ల: బడి బయట ఉండి విశ్రాంతి సమయంలో దూరవిద్యా విధానాన్ని (ఓపెన్ స్కూల్ సిస్టం) సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా మారాలని పల్నాడు జిల్లా ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో జరిగిన దూరవిద్యా విధానంలో ఐదు మండలాలో వారికి జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 15సం''రాలు పైబడి నిత్య విద్యకు దూరంగా ఉన్నవారికి విద్యను దగ్గరకు చేసేందుకు దూరవిద్య విధానం ద్వారా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ప్రతి నియోజక వర్గంలో జరుగుతుందన్నారు. ప్రభుత్వ లక్షాలను అందుకునే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. విద్య ద్వారా మంచి స్థాయిలో తీర్చిదిద్దుకొని సమాజంలో ప్రేరణ కల్పించటం ముందంజలో ఉండాలని కోరారు. ఈ సమావేశానికి సభాధ్యక్షులు హెచ్‌ఎం ఎం రామారావు అధ్యక్షత వహించగా, దూర విద్యా లక్ష్యాల గురించి రాష్ట్ర స్థాయి కో ఆర్డినేటర్ ఎస్ అక్బర్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కె ఎం ఎ హుస్సేన్, అడిషినల్ కో ఆర్డినేటర్ కెవి సుబ్బారెడ్డి, సిహెచ్ రవి గోవర్ధన్, ఎంఈఓలు అల్లి సురేష్, వేముల నాగయ్య, కాంతారావు, బెంజిమెన్, శివ నాగేశ్వరరావు, రవి కుమార్, సాంబశివరావు, పలువురు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఓపెన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు.

ఆంజనేయులు సేవలు మరువలేనివి



పదవీ విరమణ పొందిన కామర్స్ అధ్యాపకుడు సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్ సరోజిని

విజయపురిసౌత్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన కామర్స్ అధ్యాపకుడు చందు ఆంజనేయులు సేవలు మరువలేనివని స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరోజిని అన్నారు. గురువారం పదవీ విరమణ చేసిన ఆంజనేయులును సరోజిని శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి అనంతరం మాట్లాడారు. ఆంజనేయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందజేయడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేయడంలో ముందుండేవారన్నారు. నాటక రంగంలో కూడా ఆయన ఎన్నో అవార్డులను పొందారని కొనియాడారు. అనంతరం ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి, అధ్యాపకులు, ఏపీఆర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు చందు ఆంజనేయులు, సుధా రాజేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగార్జు నసాగర్ ప్రాజెక్టు రిటైర్డ్ డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం

దుర్గి: గత రెండు రోజులుగా జంగమహేశ్వరపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠం కానున్నది. ఈ కార్యక్రమానికి శనివారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ ఊరిబండి యోగయ్య తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజతో ప్రారంభమై ప్రాణ ప్రతిష్టాపన, దృష్టిస్థాపన, కుంభధ్యానందేసు, రాజ్య దీపదర్శనం, పూర్ణాహుతి, యజ్ఞతీర్థ ప్రసాదములు అర్చకులు మంగళగిరి అనిల్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులందరూ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

1,642 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతుభరోసా

ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1,642 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద లబ్ధిపొందనున్నట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా 5వ సంవత్సరం మొదటి విడతగా ఒక్కొక్క కౌలు రైతుకు రూ.7,500 చొప్పున మొత్తం 1,642 మంది కౌలు రైతులకు రూ.1,23,15,000 లబ్ధి చేకూరుతుందన్నారు. భరోసా సాయంగా అందజేస్తున్న నగదును వారివారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అటవీ, దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం కింద అర్హులుగా గుర్తించి వారిని కూడా ఆదుకోవడం జరిగిందన్నారు.

కాపునాడు జిల్లా కార్యాలయం ప్రారంభం

దాచేపల్లి : కాపునాడు పల్నాడు జిల్లా కార్యాలయాన్ని స్థానిక కారంపూడి రోడ్డు సెంటర్‌లో శుక్రవారం ప్రారంభించారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడు కూరియాల ఉదయ్ భాస్కర్ ప్రత్యేకంగా పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కాపులు ఐక్యమత్యంతో ఉండి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కాపునాడు మహిళ అధ్యక్షురాలు పిల్లా శ్రీదేవి, లంక రాంబాబు, తాయ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• శ్రావణ మాస పూజలు



దాచేపల్లిలోని వాసవీమాత ఆలయంలో ప్రత్యేక అలంకరణలో కన్యక పరమేశ్వరి



పూజలు చేస్తున్న భక్తులు

దాచేపల్లి : శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. స్థానిక శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో కూడా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి తరువాత భక్తులు పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు మాశెట్టి, యలమల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ

దుర్గి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని కంచరగుంట, ఆత్మకూరు సర్కిల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాలను శనివారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నట్లు మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు వాసులు శుక్రవారం తెలిపారు. ఉదయం 11గం''లకు పీఆర్కే, పీవీఆర్‌ల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కావున మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

నేడు ముత్యాలమ్మ దేవాలయ ప్రతిష్ట మహోత్సవం

మాచవరం: నేడు మండలంలోని వేమవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ముత్యాలమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహాలు, శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా వైదాంత పండితులచే హోమ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విచ్చేసిన భక్తులకు మహా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హాజవుతారని తెలిపారు. కావున మండల పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు కార్యక్రమానికి విచ్చేసి స్వామి వార్ల తీర్థప్రసాదలు స్వీకరించి కృపా కటాక్షములు పొందాలని తెలియజేశారు.

పథకాలకు అర్హులైన వారిని గుర్తించాలి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో వృద్ధులను, దివ్యాంగులను, ఒంటరి మహిళలతో పాటు పలు పింఛన్‌లకు నిస్పక్షపాతంగా అర్హులైన వారిని గుర్తించాలని జిల్లా అభివృద్ధి, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో సచివాలయ, వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహించి అర్హతే ప్రామానికంగా పింఛన్ అంధించడానికి కృషి చేయాలన్నారు. 2022 డిసెంబర్ నాటికి మండలంలోని 13 సచివాలయాల పరిధిలో వివిధ పింఛన్ దారులు మొత్తం 6,617 మంది ఉండగా 2023 ఆగస్టు 31 నాటికి ప్రస్తుతం 7,087 మంది ఉన్నారన్నారు. ఈ 8 నెలల కాలంలో 470 మందికి కొత్తవారిని గుర్తించి పింఛన్ కింద ప్రతి నెల వలంటీర్ల ద్వారా రూ. 12,92,500 అంధించడం జరుగుతుందన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



విజయపురిసౌత్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మాచర్ల మండలం చింతలతండా సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చింతలతండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్(50) గురువారం అర్ధరాత్రి సాగర్ వైపు నడుచుకుంటూ వస్తుండగా సరిగ్గా ఎయిర్‌పోర్ట్ ఆర్చి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో శంకర్‌నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడిని పోస్ట్ మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయపురిసౌత్ ఎస్‌ఐ పి అనిల్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మండుతున్న ఎండలు



ఖాళీగా ఉన్న ప్రధాన రహదారి

మాచర్ల: పట్టణంలోని వర్షాకాలంలో సైతం వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండలు మండుతున్నాయి. ఎటుచూసినా ఎండ ప్రభావం వల్ల అన్నీ వర్గాలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు రోడ్డు పైకి రావడం లేదు. దీంతో 12గం''ల నుంచి 4గం''ల వరకు రోడ్లు వెలవెలబోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ ఎండ ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాల కోసం వరుణ దేవునికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వరుసగా బైక్ చోరీలు

–బెంబేలెత్తుతున్న యజమానులు

నరసరావుపేట టౌన్: పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకొని చోరులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. గడిచిన పది రోజుల వ్యవధిలో ఏడు ద్విచక్రవాహనాలు అపహరణకు గురవ్వటం గమనార్హం. తాజాగా ఇంటి ఎదుట నిలిపిన బుల్లెట్ వాహనం ఉదయం లేచి చూసేసరికి అపహరణకు గురైంది. వివరాల్లో కెళ్లితే.. కోటప్పకొండ రోడ్డు వెంగళరెడ్డి కాలనీ 2వ లైనులో నివాసం ఉంటున్న షేక్ సైదావలి రోజు మాదిరిగానే గురువారం రాత్రి ఇంటి ఎదుట తన బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. పల్సర్ బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు దర్జాగా బుల్లెట్ వాహనాన్ని అపహరించుకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్, మల్లమ్మ సెంటర్, రామిరెడ్డిపేట ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను దుండగులు అపహరించుకు వెళ్లారు. అపహరించిన వాహనాల్లో ఎక్కువ శాతం బుల్లెట్ వాహనాలు ఉండటం కొసమెరుపు. చోరులు మారు తాళాలను ఉపయోగించి వాహనాలను చాకచక్యంగా అపహరిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వాహన చోరీలపై యజమానులు ఆయా స్టేషన్‌లలో ఇప్పటికే ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి సమీపంలో సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.